ఉస్మానియాకు ప్రపంచ స్థాయి గుర్తింపు

వైద్య విద్య అంటేనే
కోఠి మెడికల్ కాలేజీ, అదొక బ్రాండ్

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి
దామోదర రాజనర్సింహ

ఉస్మానియా వైద్య కళాశాల ఆవరణలో నూతన హాస్టల్ భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రులు దామోదర రాజ నర్సింహ, పొన్నం ప్రభాకర్, ఎంపీ అనిల్ కుమార్, ఎమ్మెల్సీ వెంకట్ బల్మూరి

సుల్తాన్‌బజార్, సెప్టెంబర్ 6: ఉస్మానియా మెడికల్ కళాశాల అంటేనే ఒక బ్రాండ్, ప్రపంచంలో ఎక్కడికి వెళ్ళినా హైదరాబాద్ అంటే ఉస్మానియా అనే ప్రత్యేక గుర్తింపు ఉందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. కోఠిలోని ఉస్మానియా మెడికల్ కళాశాలలో వైద్య బాలుర, బాలికలకు వేర్వేరుగా నూతన హాస్టల్ బ్లాక్ భవనాలను రూ.103 కోట్ల నిధులతో నిర్మాణ పనులను ప్రారంభించేందుకుగాను శుక్రవారం భూమి పూజ, శంకుస్థాపన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి దామోదర రాజ నర్సింహ, రాష్ట్ర రవాణ, బీసీ శాఖల మంత్రి పొన్నం ప్రభా కర్, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్, కార్పొరేటర్ రాకేశ్ జైస్వాల్, హెల్త్ సెక్రటరీ క్రిస్టీనా చోంగ్తు, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్వీ కర్ణన్, డీఎంఈ డాక్టర్ వాణి, డైరెక్టర్ పబ్లిక్ హెల్త్ డాక్టర్ రవీందర్ నాయక్, ఉస్మానియా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నరేంద్ర, టీజీఎంఎస్ఐడీసీ ఎమ్డీ హేమంత్ బోర్కాడే, ఛీఫ్ ఇంజనీర్ పి.దేవేందర్ కుమార్, సూపరింటెండెంట్ ఇంజనీర్ సురేందర్ రెడ్డిలతో కలిసి భూమి పూజ, శంకుస్థాపన కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం మంత్రి దామోదర మాట్లాడుతూ, 30 ఏండ్లుగా పెండింగులో ఉన్న సమస్యలను పరిష్కరిస్తున్నామని అన్నారు. జూడాలకు కొన్నేండ్లుగా స్టైఫెండ్ నెలల తరబడి అందలేదు. ఈ సమస్యను తాము పరిష్కరించి ప్రతి నెల పదో తేదీలోపు వచ్చేలా చేయడం జరిగిందన్నారు. విద్య, వైద్యశాఖలు ఎంతో కాంప్లికేటెడ్‌తో కూడుకున్నవని అన్నారు. దేవాలయానికి ఎంత నమ్మకంతో వెళుతామో.. అంతే నమ్మకంతో వైద్యాలయానికి వెళుతామన్నారు. ప్రభుత్వ దవాఖానాలలో నిష్ణాతులైన వైద్యులు ఉంటారనే ప్రగాఢ విశ్వాసం ప్రజలలో ఉందని అన్నారు. 30 ఏళ్ళ కిందట రాష్ట్ర సీఎం, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఎవరైనా ఉస్మానియా, గాంధీలోనే వైద్య చికిత్సలు పొందేవారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. గోషామహల్‌లో 31 ఎకరాలలో రూ.2000 కోట్ల నిధులతో అత్యాధునిక సౌకర్యాలతో ఉస్మానియా భవనం నిర్మాణం చేపడుతుందన్నారు. రాష్ట్ర రవాణా, బీసీ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ మాట్లాడుతూ వైద్యోనారాయణో హరి అని వైద్యులు గౌరవించబ డుతారని అన్నారు. అనంతరం ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రులు అధికారులు 284 మంది ల్యాబ్ టెక్నిషియన్లకు నియామక పత్రాలను అందజేశారు.

విస్కీతో ఐస్‌క్రీమ్

మద్యంతో తయారు చేసిన ఐస్‌క్రీమ్‌ల విక్రయం

యువతను
ఆకర్షించేందుకు
ఫేస్‌బుక్ ద్వారా ప్రచారం

జూబ్లీహిల్స్‌లోని పార్లర్లపై ఆబ్కారీ దాడులు

నిందితుల అరెస్టు.. 11.5 కిలోల సరుకు స్వాధీనం

సిటీబ్యూరో, సెప్టెంబర్ 6 (నమస్తే తెలంగాణ): మొన్నటి వరకు గంజాయితో మత్తు చాక్లెట్లు తయారు చేశారు.. లిక్కర్‌తో మద్యం చాక్లెట్లు రూపొందించారు.. ఇప్పుడు ఏకంగా విస్కీతో ఐస్‌క్రీమ్‌లు తయారు చేసి.. అమ్ముతున్న వైనం వెలుగులోకి వచ్చింది. ఆబ్కారీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ జాయింట్ డైరెక్టర్ ఖురేషీ, ఈఎస్ నంద్యాల అంజిరెడ్డి, ఎస్‌టీఎఫ్ ఈఎస్ ప్రదీప్‌రావు వివరాలు వెల్లడించారు. నగరానికి చెందిన శరత్‌చంద్రారెడ్డి జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 1, 5లో హరి కేఫ్ ఐస్‌క్రీమ్ పార్లర్‌ను నిర్వహిస్తున్నాడు. యువతను ఆకర్శించి.. అక్రమ మార్గంలో డబ్బులు సంపాదించే దిశగా నిబంధనలకు విరుద్ధంగా మద్యంతో ఐస్‌క్రీమ్‌లు తయారు చేసి.. విక్రయిస్తున్నాడు. దయాకర్‌రెడ్డి, శోభన్ అనే ఇద్దరు వ్యక్తులు ఈ మత్తు ఐస్‌క్రీమ్‌ను తయారు చేస్తున్నట్లు ఆబ్కారీ అధికారులు గుర్తించారు. ఫేస్‌బుక్ ద్వారా ప్రకటనలు చేస్తూ యువతను ఆకర్శిస్తున్నట్లు విచారణలో తేలింది. సమాచారం అందుకున్న ఆబ్కారీ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు జూబ్లీహిల్స్ రోడ్ నం.1, 5లోని ఐస్‌క్రీమ్ పార్లర్లపై దాడులు జరిపి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 11.5 కిలోల విస్కీ ఐస్‌క్రీమ్‌ను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు.

వివరాలు వెల్లడిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ జాయింట్ డైరెక్టర్ ఖురేషీ, ఈఎస్‌లు అంజిరెడ్డి, ప్రదీప్‌రావు

మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

అందరికీ ప్రభుత్వ ఉద్యోగాలు

సాధ్యం కాదు

కులవృత్తులతోనే ఉపాధి

రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

సిటీబ్యూరో, సెప్టెంబర్ 6 (నమస్తే తెలంగాణ) : 'అందరికీ ప్రభుత్వ ఉద్యోగాలు సాధ్యం కాదు. కులవృత్తులే కీలకం. పెరుగుతున్న టెక్నాలజీకి అనుగుణంగా కులవృత్తులు బతకాలి.. అప్పుడే అందరికీ ఉపాధి దొరుకుతుంది.' అని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ స్పష్టం చేశారు. హైదరాబాద్ కలెక్టరేట్‌లో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి, జిల్లా వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన 'మట్టి గణపతి-మహాగణపతి' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. మట్టి విగ్రహాలు వినియోగించడం వల్ల కులవృత్తులు బాగుపడుతాయని చెప్పారు. అనంతరం 2వేల మట్టి విగ్రహాలను కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కదిరివన్, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి ఆశన్న, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు స్థలం మాయం.. ప్లాట్‌గా చేసి విక్రయం!

847 గజాల స్థలం ఆక్రమణ

కొంపల్లి మున్సిపాలిటీ కమిషనర్‌కు ఫిర్యాదు

కొంపల్లి మున్సిపాలిటీ కమిషనర్ శ్రీహరికి ఆధారాలతో సహా ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 6: కొంపల్లి మున్సిపాలిటీ పరిధి నూజివీడు సమీపంలో సుమారు 847 గజాల రోడ్డు స్థలాన్ని కొంతమంది వ్యక్తులు ఆక్రమించి ప్లాట్‌గా చేసుకొని విక్రయించారు. ఈ ఉదంతం ఇటీవల నమస్తే తెలంగాణ ఆధ్వర్యంలో వెలుగులోకి వచ్చింది. మున్సిపాలిటీ పరిధిలో సర్వే నం. 199లో నాలుగెకరాల స్థలాన్ని హెచ్ఎండీఏ ద్వారా ఎంఎస్ వీ3 ఇన్‌ఫ్రా బిల్డింగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నిర్వాహకులు గ్రామ పంచాయతీ ఉన్న సమయంలో హెచ్ఎండీఏ నుంచి 69 విల్లాలకు అనుమతులు పొందారన్నారు. అదే సమయంలో విల్లాలకు సరైన రోడ్డు మార్గాన్ని చూపించేందుకు 2016లో 18.91 గుంటల స్థలాన్ని 40 ఫీట్ల రోడ్డుకు ప్రజల సౌకర్యార్థం అప్పటి గ్రామ పంచాయితీకి గిఫ్ట్ డీడ్ చేసి ఇచ్చారన్నారు. అనంతరం, మున్సిపాలిటీ ఏర్పడిన తర్వాత సంస్థ నిర్వాహకులు 2020 జూన్‌లో మున్సిపాలిటీతో ఎలాంటి ప్రమేయం లేకుండానే మార్పులు చేసుకున్నారన్నారు. యథేచ్ఛగా ప్రభుత్వానికి సం బంధించిన రోడ్డును మార్పులు చేసుకున్నారని, దీని పై గతంలోనే హెచ్ఎండీఏకు మున్సిపాలిటీ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, కాలక్రమేణ దూలపల్లి ప్రాంతానికి చెందిన బి.సత్యానారాయణ ప్రస్తుతం రోడ్డును మాయం చేసి ప్లాట్‌గా మార్చి అక్రమంగా కోట్ల రూపాయలకు విక్రయించారని కమిషనర్ శ్రీహరి దృష్టికి తీసుకెళ్లారు. కాగా, ఇటీవల దీనిపై కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కొంపల్లి మున్సిపాలిటీ కమిషనర్ శ్రీహరికి కోర్టులో శుక్రవారం అప్పీల్ చేసి ఆధారాలతో పాటు ఆయా పత్రాలను అందించి ఫిర్యాదు చేశారు. దీనిపై న్యాయస్థానంలో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ బైరి శ్రీవిద్యా ప్రశాంత్ గౌడ్ ద్వారా ఫిర్యాదు చేశామని, కబ్జాదారుల ఆక్రమణలో ఉన్న ప్రభుత్వన రోడ్డు స్థలాన్ని పరిరక్షించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో స్పందించిన కమిషనర్ సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారులతో చర్చించి ఆక్రమణకు గురైన రోడ్డు స్థలాన్ని స్వాధీనం చేసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు మాజీ సర్పంచ్ జిమ్మి దేవేందర్, కొంపల్లి అధ్యక్షులు కౌన్సిలర్ బైరి శ్రీవిద్య ప్రశాంత్ గౌడ్, మాజీ వార్డు సభ్యులు సన్న శ్రీనివాస్ దవ్, సుధర్శన్‌రెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమాన్ని ప్రారంభించిన వీసీ వీఎస్‌కే రెడ్డి

మల్లారెడ్డి వర్సిటీలో ఐటీ ఫెస్టెంబర్

మేడ్చల్, సెప్టెంబర్ 6: గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని మల్లారెడ్డి విశ్వ విద్యాలయంలో సమాచార, సాంకేతిక విభాగం ఆధ్వర్యంలో ఐటీ ఫెస్టెంబర్ అనే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా విశ్వ విద్యాలయ ఛాన్సలర్ డాక్టర్ వీఎస్‌కే రెడ్డి మాట్లాడుతూ, క్లబ్‌ల ద్వారా విద్యార్థులు సమాజ హితం కోసం పని చేయాలన్నారు. తాము సముపార్జించిన పరిజ్ఞానంతో నూతన ఆవిష్కరణ దిశగా అడుగులు వేయాలని సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ ఆంజనేయులు, ఐటీ హెచ్‌వోడీ రాజశరత్ కుమార్, డీన్‌లు హరికృష్ణ, డాక్టర్ మీరావలి, నవీన్ కుమార్, ఆనంద్ పాల్గొన్నారు.

పోషణ్ అభియాన్ గోడ పత్రిక ఆవిష్కరణ

సిటీబ్యూరో, సెప్టెంబర్ 6(నమస్తే తెలంగాణ): అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు నాణ్యమైన పూర్వ ప్రాథమిక విద్యనందించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. కలెక్టరేట్‌లో ఐసీడీఎస్ అనుబంధ విభాగాల అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. హైదరాబాద్‌లోని ఐదు ప్రాజెక్టుల పరిధిలో అంగన్వాడీ కేంద్రాల మౌలిక వసతుల కల్పన మెరుగ్గా ఉండాలని అన్నారు. సెప్టెంబర్ మాసంలో పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పేర్కొన్నారు. మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి పిల్లలకు 11 రకాల వైద్య చికిత్సలు అందించాలని సూచించారు. దత్తత ప్రక్రియ పెరిగేల చూడాలని చెప్పారు. సామ్-మామ్ కార్యక్రమంలో పిల్లలు ఆరోగ్యంగా ఉండేలా పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పోషణ లోపం, అతి పోషణ లోపం ఉన్న పిల్లలను గుర్తించి సంబంధిత యాప్ నందు వివరాలు నమోదు చేయాలని పేర్కొన్నారు. సఖి కేంద్రాన్ని పూర్తి చేయాలని వివరించారు. చార్మినార్ కేంద్రంలో మరో సఖి కేంద్ర ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని వివరించారు. సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి అక్కేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

మ్యాథ్ హ్యాకథాన్‌లో ముగ్గురు విజేతలు

ఏఐ సమ్మిట్‌లో నగదు బహుమతుల ప్రదానం

హ్యాకథాన్ విజేతలకు నగదు బహుమతిని అందజేస్తున్న ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు, స్పెషల్ చీఫ్ సెక్రెటరీ జయేశ్ రంజన్ తదితరులు

సిటీబ్యూరో, సెప్టెంబర్ 6(నమస్తే తెలంగాణ): గ్లోబల్ ఏఐ సమ్మిట్‌లో భాగంగా మెషిన్ లర్నింగ్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీ హబ్ (మ్యాథ్ హబ్) ఆధ్వర్యంలో నిర్వహించిన హ్యాకథాన్, స్టార్టప్ పిచ్‌ల విజేతలను శుక్రవారం ప్రకటించారు. 36 గంటల పాటు నిర్వహించిన హ్యాకథాన్‌లో 3వేల మంది పోటీపడగా, 30 మంది ఫైనల్ పోటీలకు ఎంపిక చేశారు. అందులో తుది రౌండ్‌ను హెచ్ఐసీసీ వేదికగా జరుగుతున్న ఏఐ గ్లోబల్ సమ్మిట్‌లో ప్రకటించి, ముగ్గురు విజేతలకు నగదు బహుమతులను అందజేశారు. ఇందులో ఫ్లాట్‌మేట్స్, సెలబ్రిటీ హెల్త్, సోల్ సపోర్ట్ ఆవిష్కరకర్తల బృందాలకు రూ.5, 3, 2 లక్షల నగదులు బహుమతులను అందజేశారు. అదే విధంగా స్టార్టప్ పిచ్ గేమ్స్‌లో 200లకు పైగా నామినేషన్లు రాగా, అందులో 20 స్టార్టప్‌లకు తుది జాబితాలో చోటు దక్కించుకున్నాయని మ్యాథ్ హబ్ హెడ్ ఆఫ్ ఆపరేషన్స్ అనిరుధ్ రెడ్డి తెలిపారు. ఈ జాబితాలో క్యాపియా, ఆన్‌నెస్ క్రయోజెనిక్స్, గోష్యూర్, రీనోట్, స్మార్ట్‌టెయిల్, ఎకోసింథెటిక్స్, ఆక్వాసెన్స్, నెక్స్ట్‌టెక్, మెడ్ఏఐ వంటి స్టార్టప్‌లు స్మార్ట్ సిటీ ఇన్నోవేషన్స్, ఏఐ ఆధారిత డయోగ్నస్టిక్స్ విభాగంలో గొప్ప పరిష్కారాలను సమర్పించాయని ఆయన తెలిపారు. ఎంపిక స్టార్టప్‌లకు పెట్టుబడిదారుల నుంచి నిధులు సమకూర్చేందుకు మ్యాథ్ కృషి చేస్తుందన్నారు.

రైతుల ఉసురుతీస్తున్న కాంగ్రెస్ సర్కార్

రుణమాఫీ చెయ్యదు.. రైతు భరోసా ఇవ్వదు

సర్కారు తీరుతో కలతచెందుతున్న అన్నదాతలు

రుణమాఫీ అందని చిట్టాపూర్ రైతు.. మేడ్చల్‌లో ఆత్మహత్య

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రులు

సురేందర్‌రెడ్డి (ఫైల్)

మేడ్చల్, సెప్టెంబర్ 6 (నమస్తే తెలంగాణ): రుణమాఫీ చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ఉసురుతీస్తున్నది. అటు రుణమాఫీ చేయకుండా..ఇటు రైతు భరోసా ఇవ్వకుండా అన్నదాతల ఆత్మహత్యలకు సర్కారే కారణమవుతున్నదని కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమని ఆరోపిస్తున్నారు. కాగా, మేడ్చల్ జిల్లాలో 30 వేల పైచిలుకు రైతులు పంట రుణాలు తీసుకున్నారని, అయితే కేవలం 3,442 మందికే రుణమాఫీ చేశారని అన్నదాతలు అన్నారు. రుణమాఫీ అందని వారు రైతులు ఆరోపిస్తున్నారు. సిద్దిపేట జిల్లా చిట్టాపూర్‌కు చెందిన రైతు సోలిపేట సురేందర్‌రెడ్డి(55) మేడ్చల్‌లోని వ్యవసాయశాఖ కార్యాలయం సమీపంలో ఆత్మహత్య చేసుకోవడం కలిచివేసింది. రెండున్నర ఎకరాల వ్యవసాయ భూమి ఉన్న సురేందర్‌రెడ్డి తీసుకున్న లక్షా 92 వేల పంట రుణాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మాఫీ చేయకపోవడంతో బలవన్మరణానికి పాల్పడినట్లు రైతులు పేర్కొంటున్నారు. అర్హులైన వారికీ రుణమాఫీ చేయకుండా ఇంకెంతమంది అన్నదాతల ఉసురుతీస్తారని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. ఎన్నికలకు ముందు రైతులందరికీ రుణమాఫీ చేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. రుణమాఫీపై ఇప్పుడు ఆంక్షలు ఎందుకు పెడుతున్నదని మండిపడుతున్నారు. రైతు సురేందర్‌రెడ్డి ఆత్మహత్యకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదులు చేసినా..లభం లేకుండా పోయిందన్నారు.

సురేందర్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రులు

మేడ్చల్‌లో ఆత్మహత్య చేసుకున్న రైతు సురేందర్‌రెడ్డి కుటుంబసభ్యులను మాజీ మంత్రులు హరీశ్‌రావు, మల్లారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి పరామర్శించారు. సురేందర్‌రెడ్డి మృతదేహానికి నివాళులర్పించి.. కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. రుణమాఫీ కాలేదని రైతు ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమంటూ.. బాధిత కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలన్నారు.



విద్యార్థులకు బీఆర్ఎస్ సంఘీభావం

గౌలిదొడ్డి గురుకుల విద్యాలయాలను శుక్రవారం బీఎస్ఎస్ నేతలు ఆర్ఎస్ ప్రవీణ్, జగదీశ్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, గువ్వల బాలరాజు, బాల్క సుమన్, క్రాంతి, బీఆర్ఎస్వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్, తుంగ బాలు సందర్శించారు. విద్యార్థులు చేపట్టిన ఆందోళనకు సంఘీభావం తెలిపారు.

అల్పపీడనం.. వర్షం

సిటీబ్యూరో, సెప్టెంబర్ 6 (నమస్తే తెలంగాణ): రుతుపవనాలకు తోడు బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో గ్రేటర్‌లో పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసింది. శుక్రవారం రాత్రి 8గంటల వరకు గచ్చిబౌలిలో అత్యధికంగా 4.30, బీహెచ్ఈఎల్‌లో 3.90 , చందానగర్, ఫిల్మ్‌నగర్, షేక్‌పేటలో 3.65, హెచ్‌సీయూ, ఆసిఫ్‌నగర్, విజయనగర్‌కాలనీ, నాంపల్లి ప్రాంతాల్లో 3.25, పటాన్‌చెరు, చార్మినార్ సర్దార్ మహల్, హయత్‌నగర్‌లో 3.0, లింగంపల్లి, ఆర్‌సీపురం, ఖాజాగూడ, కార్వాన్ ప్రాంతాల్లో 2.93, పాతబస్తీలోని చందూలాల్ బారాదరి, బేగంబజార్, హస్తినాపురం ప్రాంతాల్లో 2.70 సెం.మీల చొప్పున వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. రాగల మరో రెండు రోజులు గ్రేటర్‌లోని పలు చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు నుంచి భారీ వానలు కురిసే అవకాశాలున్నట్లు తెలిపారు. కాగా, నగరంలో శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు గరిష్ఠం 30.8, కనిష్ఠం 22.9 డిగ్రీలు, గాలిలో తేమ 84శాతంగా నమోదైనట్లు అధికారులు వివరించారు.

శుక్రవారం జలమయమైన ఖైరతాబాద్ ప్రధాన రహదారి

లంచం అడిగితే ఫిర్యాదు చేయండి

డిస్కం సీఎండీ ముషారఫ్ ఫరూఖీ

సిటీబ్యూరో, సెప్టెంబర్ 6 (నమస్తే తెలంగాణ): విద్యుత్ శాఖలో అధికారులు ఎవరైనా పనికి లంచం అడిగితే తమ కార్యాలయానికి ఫిర్యాదు చేయవచ్చని డిస్కం సీఎండీ ముషారఫ్ ఫరూఖీ సూచించారు. అవినీతి ఫిర్యాదులు స్వీకరించేందుకు సీఎండీ కార్యాలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. విద్యుత్ సంస్థలో సిబ్బంది, అధికారులు ఏదైనా పనికి లంచం అడిగితే 040-2345 4884కు, మొబైల్ నంబర్ 7680901912కు కాల్ చేసి..ఫిర్యాదు చేయవచ్చన్నారు.

జంట జలాశయాలకు 3300 క్యూసెక్కుల వరద

సిటీబ్యూరో, సెప్టెంబరు 6(నమస్తే తెలంగాణ): జంట జలాశయాలు ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ రిజర్వాయర్లకు వరద కొనసాగుతున్నది. ఎగువ ప్రాంతాలు శంకర్‌పల్లి, నవాబ్‌పేట, ఖానాపూర్, వికారాబాద్, పరిగి, చేవెళ్ల, మొయినాబాద్‌లలో కురుస్తున్న వానలతో వరద నీరు భారీగా వచ్చి చేరుతుంది. ఈ నేపథ్యంలోనే ఉస్మాన్‌సాగర్‌కు 2000, హిమాయత్‌సాగర్‌కు 1300 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుంది. ఐతే, ఉస్మాన్‌సాగర్ గరిష్ట స్థాయి నీటి మట్టం 1790 అడుగులు కాగా.., 1786.90 అడుగుల మేర నీటి నిల్వలు ఉండగా, హిమాయత్‌సాగర్ గరిష్ట స్థాయి నీటి మట్టం 1763.50 అడుగులు ఉంటే 1760.40 అడుగులకు నీటి నిల్వ ఉంది. దాదాపు రెండున్నర అడుగుల మేర వరద నీరు వచ్చి చేరితే జంట జలాశయాల నుంచి గేట్లు ఎత్తి దిగువ మూసీలోకి నీరు వదిలేందుకు జల మండలి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా, నిండుకుండలా మారిన జంట జలాశయాలను చూసేందుకు సమీప ప్రాంతాల నుంచి సందర్శకులు భారీగా వస్తుండటంతో ఆ ప్రాంతం పర్యాటకులతో ప్రత్యేక కళను సంతరించుకున్నది.

గండిపేటలో పర్యటించిన హైడ్రా కమిషనర్

బండ్లగూడ, సెప్టెంబర్ 6: చెరువులు, కుంటలను కబ్జాలు చేసి నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలపై రాష్ట్ర వ్యాప్తంగా దడ పుట్టిస్తున్న హైడ్రా అధికారులు శుక్రవారం గండిపేట మండలం పరిధిలోని పలు చెరువులను పరిశీలించారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ తన సిబ్బందితో పాటు వివిధ శాఖల అధికారులతో కలిసి శుక్రవారం పర్యటించారు. చెరువులు ఎంత మేరకు కబ్జాకు గురయ్యాయి? నిర్మాణాలు ఎంత వరకు చేపట్టారు? అనే అంశాలపై వివరాలను సేకరించారు. త్వరలో గండిపేట మండలం పరిధిలోని చెరువులు, కుంటలను ఆక్రమించి వెలసిన నిర్మాణాలపై బుల్డోజర్ దిగనుంది.

చాకలి ఐలమ్మ జయంత్యుత్సవాలపై..



చాకలి ఐలమ్మ జయంత్యుత్సవాలపై మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన సమావేశంలో పాల్గొని, వినతిపత్రం అందజేస్తున్న షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, పలువురు రజక సంఘం నేతలు

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు

శంషాబాద్ పట్టణంలోని భవిత సెంటర్‌లో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక, తదితరులు

శంషాబాద్ రూరల్, సెప్టెంబర్ 6: ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక వసతుల కల్పకు చర్యలు తీసుకుంటామని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక తెలిపారు. శంషాబాద్ పట్టణంలోని భవిత కేంద్రంతో పాటు ప్రభుత్వ పాఠశాలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సదుపాయలు అందుతున్నాయా? ఏదైనా సమస్యలతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారా? అనే అంశాలపై డీఈవో సుశీందర్ రావుతో కలిసి ఆయన పరిశీలించినట్లు తెలిపారు. భవిత కేంద్రాల ద్వారా ప్రత్యేక అవసరాల కోసం విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న వినికిడి యంత్రాలు, చక్రాల కుర్చీలు, ఆర్టిఫీషియల్ లింబ్స్, స్పీచింగ్ థెరపీ, ఫిజియోథెరపికి సంబంధించిన విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం, బాలిక ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నట్లు వివరించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఉన్న వాటి పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు. ఆయనతో పాటు తహసీల్దార్ రవీందర్ దత్తు, ఎంఈవో లక్ష్మణ్ నాయక్, ఆర్ఐ సంజీవ, పలువురు ఉపాధ్యాయులు ఉన్నారు.

అయ్యప్ప సొసైటీలో అక్రమ నిర్మాణాల కూల్చివేత



మాదాపూర్‌లోని అయ్యప్ప సొసైటీలో అక్రమ కట్టడాలను కూల్చివేసిన జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ సిబ్బంది

మాదాపూర్, సెప్టెంబర్ 6: అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టిన బహుళ అంతస్తులపై జీహెచ్ఎంసీ కొరడా ఝులిపించింది. జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి ఆదేశాల మేరకు చందానగర్ సర్కిల్ ఉప కమిషనర్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో మాదాపూర్‌లోని అయ్యప్ప సొసైటీలో అక్రమంగా వెలిసిన నిర్మాణాలను శుక్రవారం జీహెచ్ఎంసీ అధికారులు కూల్చివేశారు. ఈ సందర్భంగా చందానగర్ ఉప కమిషనర్ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ, అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపడితే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. నిర్మాణదారులకు జీహెచ్ఎంసీ అధికారులు పలుమార్లు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడం లేదని, జీహెచ్ఎంసీ మాత్రం అనుమతులు లేకుండా చేపట్టిన భవనాలను ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఇందులో భాగంగా రెండోరోజు చేపట్టిన కూల్చివేతల్లో భాగంగా రెండు బహుళ అంతస్తులతో పాటు పుట్టింగ్ స్టేజీలో ఉన్న నిర్మాణాలను కూల్చివేశారు. ఇందులో జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ సిబ్బంది తదితరులు ఉన్నారు.